క్లుప్తంగా

అడిషనల్ కలెక్టర్‌ను కలిసిన గెజిటెడ్ అధికారులు



అడిషనల్ కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న జిల్లా గెజిటెడ్ సంఘం నాయకులు

జగిత్యాలరూరల్: జిల్లా అడిషనల్ కలెక్టర్ బీఎస్.లత ఇటీవల పదోన్నతి పొందగా జగిత్యాల జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం శుక్రవారం సాయంత్రం ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కందుకూరి రవిబాబు, ప్రధాన కార్యదర్శి మామిడి రమేశ్, కోశాధికారులు గణేశ్, బద్దం రాజేందర్‌రెడ్డి, విజేందర్, ఉమేశ్వరి, రచన పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపొద్దు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: నంబర్ ప్లేట్ లేకుండా రోడ్డుపై వాహనాలు తిరిగితే చర్యలు తప్పవని పట్టణ సీఐ కరుణాకర్ అన్నారు. శుక్రవారం ఉదయం జిల్లా కేంద్రంలో కొత్తబస్టాండ్, పాతబస్టాండ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో విస్తృత వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సరైన నంబరు ప్లేట్ లేని 50 వాహనాలను పట్టుకుని అక్కడే యజమానుల చేత వాటికి నంబరు ప్లేట్లు బిగించిన అనంతరమే వాహనాలను అప్పగించారు. నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్ పాల్గొన్నారు.

గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



పోస్టర్ ప్రదర్శిస్తున్న లెక్చరర్లు, విద్యార్థులు

కథలాపూర్: గంజాయి, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అచ్యుత్‌రాజ్ అన్నారు. శుక్రవారం కథలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల వ్యతిరేక వాల్ పోస్టర్‌ను లెక్చరర్లు, విద్యార్థులు ఆవిష్కరించి ప్రదర్శించారు. అనంతరం మత్తు పదార్థాలను సేవించమని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సురేశ్, లెక్చరర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



వార్డుల్లో పర్యటిస్తున్న కమిషనర్

కోరుట్ల:సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నామని కమిషనర్ రవీందర్ అన్నారు. కోరుట్ల పట్టణంలోని పలు వార్డుల్లో శుక్రవారం పర్యటించిన ఆయన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. దోమల నివారణకు స్ప్రే చేయించడంతో పాటు వినియోగంలో లేని కుండీలలో నీరు పారబోయించడం, తదితర పనులను పరిశీలించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్,అశోక్,తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థులు



విద్యార్థులతో ఉపాధ్యాయులు

మేడిపల్లి: భీమారం మండలంలోని గోవిందారం ఉన్నత పాఠశాలకు చెందిన అవంతిక, అభినయ్ జగిత్యాల జిల్లాలోని స్వామి వివేకానంద స్టేడియంలో జరిగిన, జిల్లా స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రదర్శన చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు అథ్లెటిక్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యంరెడ్డి తెలియచేశారు.

విద్యార్థినికి సన్మానం

సారంగాపూర్: తెలంగాణ స్టేట్ కిక్ బాక్సింగ్ పోటీల్లో మండలంలోని రేచపల్లి గ్రామానికి చెందిన బింగి శివనందిని రాష్ట్రస్థాయి పోటీల్లో సిల్వర్ గోల్డ్ పతకాన్ని సాధించింది. శుక్రవారం శివనందినిని రేచపల్లిలో గల్ఫ్ గంగపుత్ర ఐక్యత సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో గంగపుత్ర ఐక్యత సంఘం నాయకులు పాల్గొన్నారు.

జ్వరాలు బాబోయ్..

- ధర్మపురిలో జ్వర బాధితులతో కిక్కిరిసిన ప్రభుత్వ ఆస్పత్రి



ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు

ధర్మపురి: వర్షాకాలంలో అపరిశుభ్రతతలో ఈగలు దోమలు చేరి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఏ ఊరు, ఏ గ్రామంలో చూసిన జ్వరాలతో బాధపడుతున్నారు. మున్సిపల్, పంచాయతీ అధికారులు చేపట్టే డ్రెయినేజీలు, పూడికతీతలు లేక పోవడంతో జ్వరాల సంఖ్య పెరుగుతుందనే ఆరోపణలున్నాయి. ధర్మపురిలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ప్రతీ నిత్యం ట్రాక్టర్ల ద్వారా తడి, పొడి చెత్తను తొలగిస్తున్నారే తప్పా డ్రెయినేజీల్లో పూడిక తీత లేక నీరు నిలిచి ఉండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. సంబంధిత అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ధర్మపురి మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులు నిబంధనలకు సరిపడ లేకపోవడంతో పూర్తి స్థాయిలో పనులు చేయించలేక పోతున్నారంటున్నారు.

ఎక్కడ చూసిన నీటి గుంటలే..

పట్టణంలోని ఖాళీ ప్రదేశాల్లో ఎక్కడ చూసిన నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. అంతే కాకుండా ఖాళీ ప్రదేశాల్లో పిచ్చిమొక్కలు, ముళ్ల కంచెలు పెరిగి దోమలకు ఆవాసాలుగా మారాయి. నీరు నిల్వకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

రోగులతో కిటకిటలాడిన ఆస్పత్రి..

జ్వరాలతో బాధపడే వారితో ఆస్పత్రి కిటకిటలాడింది. ధర్మపురితో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో జ్వరాలు పెరుగుతున్నందునా ప్రభుత్వ ఆస్పత్రి రోగులతో కిక్కిరిసి పోతుంది. ప్రభుత్వ ఆస్పత్రితో పాటు పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో నిండిపోతున్నాయి.

ప్రభుత్వ ఆస్పత్రిలో 200 ఓపీ..

స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం 200 మంది ఓపీకి చేరింది. 200 మందిలో వంద మందికి పైగా జ్వరాలతో బాధపడే వారున్నారని ప్రభుత్వ వైద్యులు తెలిపారు. జ్వరాలతో బాధపడేవారికి చికిత్సలందించి మందులు అందజేస్తున్నామని అత్యవసరమైన వారిని ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకుని వైద్యం అందిస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ రవి తెలిపారు .

దేశ ఆర్థికాభివృద్ధిలో సహకార సంఘాలది కీలక పాత్ర



పెగడపల్లి పాఠశాలలో విద్యార్థులకు స్టీల్ బాటిళ్లు పంపిణీ చేసిన రిజిస్ట్రార్ సుజాత, అధికారులు

మెట్‌పల్లి: దేశ ఆర్థికాభివృద్ధిలో సహకార సంఘాలు కీలక పాత్ర వహిస్తున్నాయని జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని బంటుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'భారతదేశ ఆర్థిక అభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర, ప్రాధాన్యత' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ధర్మపురి: సమాజంలో సహకార సంఘాల పాత్ర కీలకమని డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025 పురస్కరించుకుని స్థానిక బాలికల పాఠశాలలో శుక్రవారం సహకార సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేసారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్ సొసైటీ అధికారి రాము, డైరెక్టర్లు పాల్గొన్నారు.

సారంగాపూర్: పరస్పర సహకారం ద్వారా సహకార వ్యవస్థ బలోపేతం అవుతుందని కో ఆపరేటివ్ జిల్లా అడాప్షన్ అధికారి స్వప్న అన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరంలో భాగంగా బీర్‌పూర్ సింగిల్ విండో ఆధ్వర్యంలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు జామెట్రీ బాక్స్‌లను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సంగెనభట్ల నర్సింహ్మమూర్తి, సీఈవో అయ్యోరి తిరుపతి, డైరెక్టర్లు, రైతులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

పెగడపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సహకార సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహకార అసిస్టెంట్ రిజిస్ట్రార్ సుజాత, సీఈవోలు మధూకర్, గోపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, హెచ్‌ఎం లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని నంచర్ల, నందగిరి, నంచర్ల సహకార సంఘాల ఆధ్వర్యంలో పాఠశాలల ఆవరణలో చైర్మన్లు రమణారావు, వేణుగోపాల్, భాస్కర్‌రెడ్డి మొక్కలు నాటారు.

రాయికల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రాయికల్ సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఈవోలు రవికుమార్, ఉపేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కథలాపూర్: మండలంలోని చింతకుంటలో శుక్రవారం మహాలక్ష్మి బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసంలో గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేస్తామని గ్రామస్తులు పేర్కొన్నారు. భక్తులు ప్రత్యేక వంటకాలతో బోనాలను తయారు చేశారు. బోనాలతో గ్రామం నుంచి ఆలయం వరకు ఊరేగించారు. దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జెడ్పీ సీఈవో

రాయికల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భోజన విషయంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం రాయికల్ మండలం అల్లీపూర్‌లోని మహాత్మ జ్యోతి బాపూలే గురుకులాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, ఎప్పటికప్పుడు వార్డెన్‌పై పర్యవేక్షణ చేపట్టాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో చిరంజీవి ఉన్నారు.

ధర్మపురి: ధర్మపురిలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలను శుక్రవారం సాయంత్రం డీఆర్‌డీఏ పీడీ రఘువరన్ ఆకస్మికంగా సందర్శించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వంట గదులను పరిశీలించి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, ఏపీవో సుజన్ తదితరులున్నారు.

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, మండలంలోని తిమ్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను శుక్రవారం తహసీల్దార్ వరప్రసాద్ తనిఖీ చేశారు. కేజీబీవీలో స్వచ్ఛమైన తాగు నీరును విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. తిమ్మాపూర్ పాఠశాలలో విద్యార్థులకు వండిన భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని పెట్టాలని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ రజిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

మల్లాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ రమేష్‌గౌడ్ అన్నారు. మండలంలోని సిరిపూర్ గొసంగికాలనీ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. ఆయన వెంట ఆర్‌ఐ రాజేష్, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

జువ్వాడి నర్సింగరావు జన్మదిన వేడుకలు



కోరుట్లలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



మల్లాపూర్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు

కోరుట్ల: కోరుట్ల పట్టణంలో జువ్వాడి నర్సింగరావు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.నాయకులు,కార్యకర్తలు కేక్ కట్ చేశారు. అన్నదానం చేశారు.

మెట్‌పల్లి/ఇబ్రహీంపట్నం: మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం మండల కేంద్రాల్లో జువ్వాడి నర్సింగరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రిలో వెల్మల సుగుణాకర్‌రావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిరిపురం రవీందర్, ఎల్లాల జలపతిరెడ్డి, నల్లా రాజన్న, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న బీడీ కార్మికులు

మెట్‌పల్లిరూరల్: మండలంలోని వెల్లుల శివారులో బీడీ కార్మికులు ఆందోళన చేపట్టారు. మెట్‌పల్లి,ఇబ్రహీంపట్నం,మల్లాపూర్ మండలాలకు చెందిన బీడీ కార్మికులు శుక్రవారం భారీ సంఖ్యలో తరలివచ్చి శివాజీ,రాజ్‌కమల్ బీడీ ఆఫీస్‌ల ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంపెనీ నుంచి తమకు నాసిరకమైన తునికాకు,తంబాకు, దారం అందిస్తున్నారని,ఈ కారణంగా తాము నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ సభ్యుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా బీడీలు చేస్తూ జీవనోపాధి పొందుతున్న తమకు నాసిరకం సమస్య దెబ్బగా మారిందన్నారు. అనంతరం కంపెనీ సభ్యులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ,ఏఐటీయూసీ నాయకులు రాములు, ఉస్మాన్, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

వెల్గటూర్ : మండలంలోని మొక్కట్రావుపేటలో గత కొద్ది కొద్ది రోజుల క్రితం వెలిసిన అక్రమ గుడిసెల నిర్మాణాలను శుక్రవారం పోలీసుల సహాయంతో రెవెన్యూ అధికారులు తొలగించారు. ఈ క్రమంలో గ్రామస్తులకు అధికారులకు మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అక్రమ గుడిసెలను తొలగించాలని తహసీల్దార్ శేఖర్ గ్రామస్తులకు సూచించినా తొలగించక పోవడంతో రెవెన్యూ అధికారులు, పోలీసులు వెళ్లి జేసీబీతో అక్రమ నిర్మాణాలు తొలగించేందుకు వెళ్లగా అధికారులతో గ్రామస్తులు గొడవకు దిగారు. అధికారులు వారికి నచ్చజెప్పి గుడిసెలను తొలగించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేఖర్, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై ఉమాసాగర్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లారీ,ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మెట్‌పల్లిరూరల్: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు వాహనాలను పట్టుకున్నట్లు మెట్‌పల్లి తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని బండలింగాపూర్ వద్ద, ట్రాక్టర్‌ను వెల్లుల వద్ద పట్టుకున్నట్లు తెలిపారు.ఎవరికైనా ఇసుక అవసరమైతే అనుమతులు తీసుకోవాలని సూచించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు..

మల్లాపూర్ : మండలంలోని పెద్దవాగు నుంచి శుక్రవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 2 ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు చిట్టాపూర్‌లో దాడి చేసి పట్టుకున్నట్లు తహసీల్దార్ రమేష్‌గౌడ్ తెలిపారు. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యలయానికి తరలించినట్లు తెలిపారు. అనుమతి లేకుండా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు పెగడపల్లిలో మంత్రి అడ్లూరి పర్యటన

పెగడపల్లి: మండలంలో శనివారం రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పర్యటించనున్నారు. మండలంలోని ఆరవెల్లిలో రూ. 20 లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం భవనం ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొంటారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

▶ ఉద్యోగ విరమణ పొందిన వారికి వెంటనే బెనిఫిట్స్ ఇవ్వాలి

జగిత్యాల: ఉద్యోగ విరమణ పొందిన ప్రతీ ఉపాధ్యాయుడికి బెనిఫిట్స్ అదేరోజు అందేలా చర్యలు తీసుకోవాలని తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు అన్నారు. ఇటీవల అంతర్గాంలో హెచ్‌ఎంగా పనిచేసిన సరోజినీ ఇటీవల పదవీ విరమణ చేయగా తపస్ బాధ్యులు ఆమెను సన్మానించారు.కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్ రావు, జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

▶ కాంగ్రెస్ ప్రభుత్వంపై విపక్షాల దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

మల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వంపై విపక్షాల దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మండలంలోని కొత్తదాంరాజుపల్లికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బద్దం నర్సారెడ్డి, మాజీ ఎంపీటీసీ మెండు గంగారెడ్డి, సీనియర్ నాయకుడు ఎగ్యారపు లింబాద్రి శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరగా, వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, కాంగ్రెస్ సేవాదల్ జిల్లా అధ్యక్షుడు నాయిని సురేష్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

▶ సమగ్ర సర్వే డ్యూటీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని వినతి

రాయికల్: సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సర్వే డ్యూటీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు శుక్రవారం ఎంపీవో సుష్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు చెరుకు మహేశ్వరశర్మ, వేముల మధు, మండల అధ్యక్షుడు కొండూరి రజినికాంత్, సభ్యులు రమేష్ పాల్గొన్నారు.

▶ దొడ్డి కొమురయ్యకు నివాళి

మెట్‌పల్లి: తెలంగాణ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా వేడుకలను పట్టణంలో శుక్రవారం కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై ఉన్న ఆయన విగ్రహానికి మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, ఐఎంఏ అధ్యక్షుడు గంగసాగర్‌లతో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

▶ స్వామి వివేకానంద, అల్లూరి యువతకు స్ఫూర్తి

జగిత్యాలటౌన్: వివేకానందుడి ఆలోచనలు, అల్లూరి సీతారామరాజు త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని భారత్ సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు అన్నారు. స్వామి వివేకానంద వర్ధంతి, అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా శుక్రవారం మినీస్టేడియంలోని వివేకానంద విగ్రహానికి, అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు అక్కినపెల్లి కాశీనాథం, పుప్పాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: స్వామి వివేకానంద ఆలోచనలే యువతకు మార్గదర్శకమని కొల్వాయి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కొలిచాల సత్యరాజ్ అన్నారు. పాఠశాలలో వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

▶ పాఠశాలలో నీటి కొరత తీర్చిన గ్రామస్తులు

మల్లాపూర్: మండలంలోని రేగుంటలో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థుల సౌకర్యార్థం ఆల్ యూత్ అసోసియేషన్-స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు గనవేని మల్లేశ్ నేతృత్వంలో గ్రామస్తులు కలిసికట్టుగా ముందుకు వచ్చి నీటి సమస్యను పరిష్కరించారు. వాటర్ ఫిల్టర్ మెషిన్ పాడై పోవడంతో పాటు రిగ్గు మోటర్ చెడి పోవడంతో తాగడానికి, వాష్ రూమ్, ఇతర అవసరాలకు నీటి కొరత ఏర్పడి ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాల నీటి సమస్య గురించి తెలుసుకున్న గనవేని మల్లేష్ నేతృత్వంలో గ్రామస్తులతో కలిసి విరాళాలు సేకరించి వాటిని బాగుచేయించి నీటి సమస్యను తీర్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

▶ పాఠశాలకు కంప్యూటర్ టేబుల్స్ వితరణ

వెల్గటూర్ : మండలం లోని ముత్తునూర్ జెడ్పీ హైస్కూల్‌కు లయన్స్ క్లబ్ హన్మకొండ లయన్ గండ్ర ప్రవీణ్ కుమార్-రాధిక దంపతులు ఐదు కంప్యూటర్ టేబుల్స్, కుర్చీలు, 200 మందికి నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ గోల్ల తిరుపతి, హెచ్‌ఎం విమలాదేవి, తదితరులు పాల్గొన్నారు.

▶ నోట్‌బుక్స్ పంపిణీ

కోరుట్ల: లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల ఆధ్వర్యంలో శుక్రవారం 320 జీ ఆవిర్భావ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదర్శనగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్‌లు, పెన్నులు, పలకలు పంపిణీ చేశారు.

▶ యూనిఫామ్స్ పంపిణీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

కోరుట్ల: పాఠశాలల్లో యూనిఫామ్స్, టెక్స్ట్ బుక్స్, వర్క్‌బుక్స్ పంపిణీ జాగ్రత్తగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంఈవో గంగుల నరేశం అన్నారు. శుక్రవారం పట్టణంలోని విద్యావనరుల కేంద్రంలో హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ప్రతీ పాఠశాలలో న్యూట్రీషన్ కిచెన్ గార్డెన్ ఉండేలా చూడాలని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం అత్యధిక విద్యార్థుల నమోదు సాధించిన హెచ్‌ఎంలను సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఆనందరావు, భూమయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

▶ బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపిక

జగిత్యాలరూరల్: మండలంలోని పొరండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో ఇటీవల పదో తరగతి పూర్తి చేసుకున్న ముగ్గురు విద్యార్థినులు బోదనపు అంకిత, కీర్తన, కావేరీ బాసర ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీటు సాధించినట్లు పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రాంమోహన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

▶ ట్రిపుల్ ఐటీలో గిరిజన విద్యార్థికి సీటు

ధర్మపురి : జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని పెద్దనక్కలపేట గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి బద్ది సాయినాథ్‌కు బాసర ట్రిపుల్ ఐటీలో చోటు దక్కించుకున్నాడు. విద్యార్థి ఎంపికపై హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసారు.

▶ కోరుట్ల ఎస్సైగా చిరంజీవి

కోరుట్ల: కోరుట్ల ఎస్సైగా చిరంజీవి నియామకమయ్యారు.ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

పెగడపల్లి: యూరియా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏవో శ్రీకాంత్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణదారులతో శుక్రవారం ఆయన సమావేశమై మాట్లాడారు. ఎంఆర్పీ ఈ పాస్ యంత్రాల వినియోగించి ఎంఆర్పీ ధరలకు ఎరువులు విక్రయించి స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించి రైతులకు రోదులు ఇవ్వాలన్నారు. సమావేశంలో ఏఈవోలు పాల్గొన్నారు.


యూరియా కొరత లేదు

ఇబ్రహీంపట్నం: మండలంలో యూరియా కొరత లేదని మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. మండలంలో ఇప్పటివరకు 800 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంచగా, రైతులు పూర్తిగా కొనుగోలు చేశారని, ఇది గతేడాది జూన్ 30వరకు కొనుగోలు చేసిన దానికంటే 150 టన్నుల అధికమని తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మి ప్రస్తుత అవసరానికి కాకుండా సీజన్‌కు కావాల్సిన యూరియా మొత్తాన్ని రైతులు ఒకేసారి కొనుగోలు చేస్తున్నారని, 2 రోజుల్లో మండలానికి 160 టన్నుల యూరియా వస్తుందని రైతులు ఆందోళన పడొద్దని తెలిపారు.

ఓటరు జాబితా తయారీపై శ్రద్ధ తీసుకోవాలి

కథలాపూర్: ఓటరు జాబితా తయారీపై బీఎల్వోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నియోజకవర్గ శిక్షణాధికారి శ్రీధర్ అన్నారు. శుక్రవారం కథలాపూర్‌లో మండలంలోని 41 మంది బీఎల్వోలకు ఓటరు జాబితా తయారీపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్వోలు తమ పరిధిలోని ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపుల విషయంలో నిశితంగా పరిశీలించి తుది నిర్ణయం తీసుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి ఓటరు జాబితాలో చేర్చాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వినోద్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ నాగేశ్, సోహేల్ పాల్గొన్నారు.

పగిలిన విద్యుత్ స్తంభం



స్తంభాన్ని చూపిస్తున్న రైతులు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట గ్రామశివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు బిగించిన విద్యుత్ స్తంభం పగుళ్లుబారి సుమారు 20 రోజులు గడిచిందని, మరమ్మతుల గురించి పట్టించుకునేవారు కరువయ్యారని రైతులు శుక్రవారం తెలిపారు. అధికారులకు విన్నవించినా స్పందన కరువైందన్నారు. విద్యుత్ స్తంభం పగుళ్లుబారడంతో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా లేకపోవడం వల్ల వరి నార్లు ఎండిపోతున్నాయని రైతులు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు చొరవ చూపి పగుళ్లుబారిన విద్యుత్‌స్తంభం నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసి వేరే చోట త్వరగా ఏర్పాటు చేయాలని రైతులు ఏలేటి నడ్పి సాయబ్, కొత్తపెల్లి కాశీం, లింగారెడ్డి, రాజం, సహదేవ్ కోరారు.